క్లుప్తంగా...

సీఎం క్షమాపణలు చెప్పాలి

రాంగోపాల్‌పేట్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగుల విశ్వసనీయత కోల్పోయిందని ఏబీవీపీ వర్కింగ్ కమిటీ సభ్యులు జీవన్ ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీల అనంతరం ప్రభుత్వం పక్కా ప్రణాళిక, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించకుండా అనేక లోపాలతో నిర్లక్ష్యంగా నిర్వహించడంతోనే గ్రూప్–1ను హైకోర్టు రద్దు చేసిందని ఈ ఘటన నిరుద్యోగులను దిగ్భ్రాంతికి గురి చేసిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

లాస్యను గెలిపించడమే లక్ష్యం



మర్రి రాజశేఖర్ రెడ్డితో లాస్య నందిత, బోర్డు మాజీ సభ్యులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితను భారీ మెజార్టీతో గెలిపించుకోవడమే ఏకైక ధ్యేయమని మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న నివాసంలో శనివారం బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ముఖ్యనేతలతో జరిగిన కీలక సమావేశంలో కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కలిసికట్టుగా పనిచేసి, బీఆర్‌ఎస్ విజయానికి బాటలు వేస్తామని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులంతా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, శ్యాంకుమార్, లోకనాథం పాల్గొన్నారు.

యూజీసీ ఎరియర్స్ మంజూరుపై హర్షం



భూపేందర్‌రాథోడ్

గాంధీఆస్పత్రి : గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న యూజీసీ ఎరియర్స్ చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తూ జీవో జారీ చేయడంపై టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ భూపేందర్ రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ 2016 జనవరి నుంచి 2020 ఆగస్టు వరకు యూజీసీ బకాయిలను మంజూరు చేస్తూ శనివారం సాయంత్రం సంబంధిత ఫైల్‌పై సంతకం చేయడంతో టీజీజీడీఏ ప్రధాన డిమాండ్ నెరవేరిందన్నారు. సీఎం కేసీఆర్ ఆశయమైన ఆరోగ్య తెలంగాణ సాధనలో ప్రభుత్వ వైద్యులు, సంఘం తమ వంతు కృషి చేసిందని, ప్రభుత్వ వైద్యుల న్యాయమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూజీసీ ఎరియర్స్ మంజూరు చేసిన సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావు, వైద్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి రిజ్వీ, డీఎంఈ రమేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మల్కాజ్‌గిరి సీటు ముదిరాజ్‌లకు ఇవ్వాలి



మాట్లాడుతున్న పిట్ల నాగేశ్ ముదిరాజ్

కంటోన్మెంట్: మల్కాజ్‌గిరితో పాటు మిగిలిన నాలుగు స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా బీసీలు, ముఖ్యంగా ముదిరాజ్‌లకు టికెట్ కేటాయించాలని బీసీ శక్తి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పిట్ల నాగేశ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మారేడుపల్లిలోని బీసీ శక్తి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. బీసీ సామాజిక వర్గంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు ఒక్క ఎమ్మెల్యే సీటు కేటాయించకపోవడం దారుణమన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ముదిరాజ్‌ల ప్రాబల్యం గణనీయంగా ఉన్నందున గతంలో ఈ స్థానం నుంచి ప్రధాన పార్టీలు ముదిరాజ్‌లకే టికెట్ ఇచ్చాయన్నారు. బీఆర్‌ఎస్ తమ అభ్యర్థిగా ప్రకటించిన మైనంపల్లి హన్మంతరావు పార్టీకి రాజీనామా చేసినందున ఆయన స్థానంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ యాదవ్, బాలాజీ నాయక్, రవి నాయక్, సంపత్ గౌడ్, మల్లేశ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

అమీర్‌పేట: అమీర్‌పేట మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శనివారం రెవెన్యూ అధికారులు సందర్శించారు. తహసీల్దార్ భీమయ్యగౌడ్ సిబ్బందితో కలిసి సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు.మండంలో మొత్తం 46 కేంద్రాలుండగా 5 మోడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. దివ్యాంగులు, మహిళల కోసం ప్రత్యేక కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

అడ్డగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్ వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేట్‌కు చెందిన పుట్ట శ్రీశైల లింగం (42) ఆటోడ్రైవర్. పదేళ్ల క్రితం వివాహం జరగగా కొన్ని నెలలకే భార్య వెళ్లిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని హైదరాబాద్ ఎండ్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

గణపయ్యా.. పూజలందుకోవయ్యా..

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లో వెలసిన బొజ్జ గణపయ్యలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మండపాలను సందర్శించి పూజలు చేస్తున్నారు.
– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



బౌద్ధనగర్:ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బస్తీవాసులు



పూజలు చేస్తున్న శ్రీనివాసనగర్ మణికంఠ ప్రైడ్ అపార్ట్‌మెంట్ మహిళలు



చిలకలగూడ బజరంగ్‌సేన ఆధ్వర్యంలో..



జోషికాంపౌండ్ రాజరాజేశ్వరీ అపార్ట్‌మెంట్‌లో..



గాంధీ టీఎన్‌జీవో ఆధ్వర్యంలో జరిగిన వినాయక పూజలో పాల్గొన్న సూపరింటెండెంట్ రాజారావు, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, టీఎన్‌జీవో ప్రతినిధులు



మాణికేశ్వర్‌నగర్‌లో వినాయకున్ని దర్శించుకుంటున్న డిప్యూటీ మేయర్ దంపతులు



లాలాగూడలో..



వినాయక పూజలో కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్



రాంగోపాల్‌పేట్: పూజలు చేస్తున్న కార్పొరేటర్ సుచిత్ర



రెజిమెంటల్‌బజార్‌లో అన్నదానం చేస్తున్న లాస్య నందిత



బేగంపేట్: ఆర్థన్‌మనీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గణపతికి పూజలు



అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ శేషకుమారి



కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ పూజలు



బల్కంపేటలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా పూజలు



రైల్వే కాలనీలో..



ఓయూలో పూజలు చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ



బోయిన్‌పల్లిలో గణనాథుడి పూజలో పాల్గొన్న లాస్య నందిత, పాండుయాదవ్, ప్రతాప్



గణపతి పూజలో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి



పూజలు చేసిన బీజేపీ నాయకురాలు ఆకుల విజయ

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టే పలు పనులను శనివారం ఆయన స్థానిక కార్పొరేటర్ హేమలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆయా ప్రాంతాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడూ లేదన్నారు. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో వీడీసీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, వరదనీటి కాల్వల నిర్మాణం, పార్కుల అధునీకీకరణ, బస్తీలు, మురికివాడల్లో నూతన కమ్యూనిటీహాళ్ల నిర్మాణం, పేద, మధ్య తరగతి వర్గాల కోసం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్ల నిర్మాణం వంటి అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అమలు చేయడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక ప్రజలు సూచించిన పలు సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్ గౌడ్, జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ శంకర్, జలమండలి సీజీఎం ప్రభు, డీజీఎం క్రిష్ణ, విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్, ఏడీఈ మహేష్, నాయకులు వెంకటేషన్, ఏసూరి మహేష్, ఎం. బాల్‌రెడ్డి, టి. వెంకటరమణ, ప్రేమ్, శ్రీకాంత్‌రెడ్డి, అబ్బాస్, ఫయూమ్, కుమార్ యాదవ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సంకేత భాషా దినోత్సవం

రాంగోపాల్‌పేట్: అంతర్జాతీయ సంకేత భాషా (సైన్స్ లాంగ్వేజ్ డే) దినోత్సవాలు సికింద్రాబాద్ వైఎంసీఏలో శనివారం ఘనంగా నిర్వహించారు. డెఫ్ ఎనబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీసీ వెల్ఫేర్ శాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం హాజరై మాట్లాడారు. శ్రావ్యమైన శబ్దం అంటే నిశబ్దమేనని అన్నారు. సంకేత భాషా ద్వారా వెయ్యి మంది ఒక చోట ఉన్నా కూడా ఇతరులకు ఇబ్బంది కలుగకుండా మాట్లాడుకోగలుగుతారని అన్నారు. అనంతరం మూగవారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎడ్యు సైన్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టెక్ మహేంద్ర ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ సుధీర్‌బాబు, డెఫ్ ఎనబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ అండ్ సీవో రమ్య మిర్యాల తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న వెంకటేశం

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి



రసూల్‌పురా: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి శ్రీ గణేష్ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ పేర్కొన్నారు. మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో స్థానిక ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసిన నూతన ఆటో యూనియన్ స్టాండ్‌ను శనివారం శ్రీ గణేష్ ప్రారంభించి మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కంటోన్మెంట్‌లోని ఐదు వందల మంది ఆటోడ్రైవర్లకు రూ. మూడు లక్షల చొప్పున ప్రమాద భీమా కల్పించామన్నారు. కంటోన్మెంట్‌లో ఆటో డ్రైవర్లు ఆటో అడ్డాల సమస్యలు, ఇన్సూరెన్స్, చలాన్లు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి రాగా దశల వారీగా వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చానన్నారు. బస్తీలో దొంగతనాలు జరుగుతున్నందున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో వాటి ఏర్పాటుకు రూ.25 వేలను అందజేస్తానన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

లాలాపేట: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 22న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూ కోల్ట్ సిబ్బంది తార్నాక ఫ్లై ఓవర్ కింద 45 – 50 వయస్సున్న ఓ వ్యక్తి అచేతనంగా పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే 108 అంబులెన్స్‌ను పిలిపించి పరీక్షించగా అతడు చనిపోయినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

కూచిపూడిలో ప్రతిభ



శృతికను అభినందిస్తున్న నిర్వాహకులు

బౌద్ధనగర్: డివిజన్‌లోని జామై ఉస్మానియాలో శనివారం కళానృత్యానికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి నిర్వాహకురాలు బిందు అభినయ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది బాలికలు పాల్గొన్న ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గడ్డమీది శృతికకు జ్ఞాపిక బహూకరించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురువురు బిందు, లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

బీజేపీ అధికారంతోనే అభివృద్ధి సాధ్యం



బీజేపీలో చేరిన బాలకృష్ణ

సనత్‌నగర్: రాష్ట్రంలో బీజేపీ అధికారంతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.బాలకృష్ణ శనివారం బీజేపీలో చేరారు. బేగంపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయే రీతిలో దేశాన్ని అభివృద్ధి బాటలు పట్టించారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం దక్కేలా ఎన్నో బృహత్తర పథకాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోనూ బీజేపీకి అధికారం ఇస్తే కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతుందన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును రద్దు చేయాలి



బన్సీలాల్‌పేట్: మహిళా రిజర్వేషన్ బిల్లును రద్దు చేయాలని శనివారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ ముందున్న డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ముందు ఆందోళన నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ఉపకోటా లేకపోవడం దారణమని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెహమాన్, జిల్లా కన్వీనర్ కార్తీక్ మహారాజ్ పేర్కొన్నారు. మహిళా బిల్లు అగ్రకుల మహిళలను రాజకీయంగా ప్రోత్సహించే విధంగా ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సైదాబాబు, కృష్ణ, ఉదయ్‌కుమార్, రాజీవ్, నర్సింగ్ సంతోష్, రాజేష్ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



భగత్

అడ్డగుట్ట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మాజీద్ వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన భగత్ రామకటా (36) దినసరి కూలి. ఏడాది క్రితం నగరానికి వచ్చి తన స్నేహితుడితో కలిసి వనస్థలిపురంలో ఉంటున్నాడు. భగత్ నిత్యం మద్యం తాగుతుండటంతో స్వగ్రామమైన ఒడిస్సాకు పంపించేందుకు స్నేహితుడు వెంకటేశ్వర్లు జనవరి 13న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు బీఎస్. రెడ్డినగర్‌లో భగత్‌ను బస్సు ఎక్కించి భగత్ కుటుంబానికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. రోజులు గడుస్తున్నా భగత్ ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో వృద్ధుడు..



చాంద్ పాషా

వరంగల్‌కు చెందిన చాంద్ పాషా (65) ఈ నెల 14న కవాడిగూడలో నివసించే తన కూతురి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు వరంగల్ వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లిన చాంద్ పాషా కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

2న వంజరి కులస్తుల సర్వసభ్య సమావేశం



లాలాపేట: తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 2న తార్నాకలోని వంజరి భవన్‌లో వంజరి కులస్తుల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. శనివారం తార్నాకలోని వంజరి సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో సర్వసభ్య సమావేశం ఎజెండా, సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, రానున్న రోజుల్లో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వంజరి సంఘం అభివృద్ధికి ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో కాలేరు నరేందర్, కందారి వెంకటేశం, కాలేరు అమరేందర్, సాల్వేరు ముత్తయ్య, రాజు, ప్రవీణ్, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి చదునుకు యత్నం: ముగ్గురిపై కేసు

అడ్డగుట్ట: కోర్టు కేసులో ఉన్న భూమిని చదును చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దయాకర్ వివరాల ప్రకారం.. మహేంద్రా హిల్స్‌లోని 844బై1పీ సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలానికి సంబంధించిన కేసు కొంతకాలంగా కోర్టులో నడుస్తుంది. శనివారం ఎంవీఆర్ మూర్తి, ఆరీఫ్, మహమ్మద్ అలీ సదరు స్థలాన్ని జేసీబీతో చదును చేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న మారేడుపల్లి మండల కార్యాలయ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పనులు అడ్డుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు

నకిలీ డాక్టర్ రిమాండ్

అడ్డగుట్ట: డాక్టర్ పేరుతో చలామణి అవుతున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలిచిన ఘటన తుకారాంగేట్ పరిధిలో చోటు చేసుకుంది. వెస్ట్ బెంగాల్‌లోని హబ్రా గ్రామానికి చెందిన తుహిన్ కుమార్ మండల్(30) పది వరకు చదువుకున్నాడు. 2012లో చిత్తూరు జిల్లా మదనపల్లిలో డా. బిస్వాస్ వద్ద అసిస్టెంట్‌గా చేరి పైల్స్ ట్రీట్‌మెంట్ నేర్చుకున్నాడు. 2016లో నగరానికి వచ్చిన తుహిన్ కుమార్ మండల్ తుకారాంగేట్‌లో 'గీతా క్లినిక్'(పైల్స్ ట్రీట్‌మెంట్) పేరుతో ఓ క్లినిక్ నడుపుతున్నాడు. సమాచారం మేరకు శనివారం పోలీసులు క్లినిక్‌పై దాడులు చేశారు. తుహిన్ కుమార్ మండల్ వద్ద ఎలాంటి ఆధారిత సర్టిఫికెట్ లేకపోవడంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.